www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 14 జులై 2025

5

తిరుపతి



## ప్రజల సహకారంతోనే అవార్డు : కమిషనర్

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా మరోసారి అవార్డును దక్కించుకోవడం తిరుపతి ప్రజల సహకారంతోనే సాధ్యమైందని కమిషనర్ మౌర్య తెలిపారు. జాతీయ స్థాయిలో సూపర్ స్వచ్ఛ లీగ్ పురస్కారానికి నగరం ఎంపిక కాగా ఈనెల 17న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో మేయర్ శిరీష, కమిషనర్ ఎన్. మౌర్య పాల్గొని పురస్కారం అందుకోనున్నారు. ఈ ఏడాది ప్రెసిడెన్సియల్, మినిస్టీరియల్, మినిస్టీరియల్ (రాష్ట్రస్థాయి), సూపర్ స్వచ్ఛ లీగ్ నగరాలు అనే నాలుగు విభాగాల్లో పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీ పురస్కారానికి గడిచిన మూడేళ్లలో స్వచ్ఛతలో విశేష గుర్తింపు పొందిన నగరాలను ఎంపిక చేశారు. నగర ప్రజలు, అధికారులు, కార్మికుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని కమిషనర్ ఎన్. మౌర్య అన్నారు. దీనికి సంబంధించిన ర్యాంకులు ఈనెల 17వ తేదీ కేంద్ర ప్రభుత్వం ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

# రాయుడి హత్య కేసులో రాజకీయ కోణం..?

### రిమాండ్‌కు వినుత దంపతులు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సంచలనంగా మారిన జనసేన కార్యకర్త రాయుడు హత్య కేసులో రాజకీయ కోణం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తొలుత ఈ హత్య వినుత దంపతుల వ్యక్తిగత వ్యవహారాల కారణంగానే జరిగిందని అనుకున్నారు. కానీ రాయుడి హత్యోదోంతం బయటపడ్డ శనివారం నాడే శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేసి విచారం వ్యక్తం చేశారు. ఈ హత్యకు రాజకీయాలు పులమొద్దని సూచించారు. అయితే రాయుడి హత్య కేసులో నిందితులుగా ఉండి పులాల్ జైలుకు రిమాండ్ ఖైదీలుగా వెళ్తున్న క్రమంలో వినుత దంపతులు చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఒక మహిళను రాజకీయంగా ఎదగనీయకుండా అణగదొక్కే క్రమంలో కొందరు నీచ రాజకీయాలు చేస్తున్నారనీ, తాను బయటకు వచ్చాక వారి సంగతి తెలుస్తానంటూ వినుత హెచ్చరించారు. వినుత భర్త చంద్రబాబు ఏకంగా బొజ్జల సుధీర్ రెడ్డి పై ఆరోపణలు చేయడం రాయుడు హత్యలో రాజకీయ కోణాలు ఉన్నాయనిడానికి బలాన్ని చేకూరుస్తున్నాయి. ఏది ఏమైనా పోలీసుల విచారణలో అన్ని విషయాలు తేలనున్నాయి.

### స్వగ్రామానికి చేరిన రాయుడు మృతదేహం

జనసేన కార్యకర్త, వినుత దంపతుల వ్యక్తిగత సహాయకుడు రాయుడు అలియాస్ శ్రీనివాసులు మృతదేహం ఆదివారం స్వగ్రామమైన శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని బొక్కిసంపాలెం గ్రామానికి చేరుకుంది. రాయుడి హత్య కేసులో నిందితులుగా ఉన్న జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి కోట వినుత, ఆమె భర్త చంద్రబాబు, మరో ముగ్గురు నిందితులు ప్రస్తుతం చెన్నై పులాల్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. కాగా రాయుడు మృత దేహం ఆదివారం ఉదయం బొక్కిసంపాలేనికి చేరుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆదివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. రాయుడి సోదరి నాకు నువ్వు తప్ప ఇంకెవరు ఉన్నారు రా అంటూ.. రోదించడం చూపరులను కంటతడి పెట్టించింది.

రాయుడు (ఫైల్ ఫోటో)

మృత దేహం వద్ద రోదనలు

### నిరాధార ఆరోపణలు తగవు : టీడీపీ నాయకులు

**ప్రజాశక్తి - రేణిగుంట:** తమ వద్ద పనిచేస్తున్న డ్రైవర్ని హత్య చేశారన్న నేరారోపణలో అరెస్టయిన జనసేన నాయకులు కోటా వినుత, కోట చంద్రబాబులు.. ఎమ్మెల్యే సుధీర్ పై నిరాధార ఆరోపణలు చేయటం తగదని రేణిగుంట మండల టిడిపి అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషాలు తెలిపారు. శనివారం రాత్రి చెన్నైలో కోర్టుకు తీసుకుని వెళ్లేటప్పుడు కోటా వినుత దంపతులు తమ తప్పేమీ లేదంటూ ఇదంతా కావాలనే ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేశారని ఆరోపించడం అసత్యమని వారు ఖండించారు. నేరారోపణ వచ్చినప్పుడు దాన్ని నిరూపించుకునే బాధ్యత వారిదేనన్నారు. అలా చేయకుండా ఇతరులపై అబాండం మోపటం విడ్డూరంగా ఉందన్నారు. అనవసరంగా తమ ఎమ్మెల్యేపై నిందలు వేస్తే ప్రజలే తిరగబడే పరిస్థితి వస్తుందన్నారు. హత్య కేసులో అరెస్టవటంతో వారు ఏమి మాట్లాడుతున్నారో వారికే అర్థం కాని పరిస్థితుల్లో ఉన్నారన్నారు.

## రీచ్ గ్లోబల్ సేవలు ఎనలేనివి : కలెక్టర్

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ దశమ వార్షికోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, వారి సేవా కార్యక్రమాలు ఎనలేనివి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆదివారం స్థానిక కచ్చపి ఆడిటోరియంలో గ్లోబల్ రీచ్ ఫౌండేషన్ వార్షికోత్సవం

సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ రమేష్ నాథ్ లింగుట్ల, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీటీడీ మెంబర్ భాను ప్రకాష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..మన జిల్లాలో ఎన్నో ఎన్జీవోస్ ఉన్నాయని, ప్రభుత్వంతో వారు చేయికలిపి వివిధ రంగాల్లో సహాయం చేయడం గొప్ప విషయమన్నారు. ఎన్జీవోస్ స్వలాభం సేవా దృక్పథంతో సహాయ, సహకారాలు అందిస్తారని తెలిపారు. జిల్లాలో బంగారు కుటుంబాలు 83,000 పై గా ఉన్నాయని, ఇప్పుడు 5,000 మందిని మనం ట్యాగ్ చేసుకోగలిగామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్ సి ముని కృష్ణ, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి, రాస్ వెంకటరత్న, మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## కందారపు మురళీ కుటుంబానికి పరామర్శ

కందారపు మురళి కుటుంబాన్ని పరామర్శిస్తున్న సినీ గేయ సుద్దాల అశోక్ తేజ దంపతులు

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** తల్లిని కోల్పోయి విషాదంలో మునిగి ఉన్న కందారపు మురళి కుటుంబాన్ని ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ ఆదివారం సాయంత్రం పరామర్శించారు. స్థానిక యశోదా నగర్‌లోని కందారపు మురళి సోదరుడు కందారపు మోహన్ ఇంట్లో సుద్దాల అశోక్ తేజ.. కందారపు రాజమ్మ కుమారులను, కుమార్తెలు రమాదేవి, విజయలక్ష్మి, కోడళ్ళు అవనిగడ్డ పద్మజ, సుజాత అల్లుళ్ళు మల్లికార్జున రావు, ఓం ప్రకాష్ తదితరులను పరామర్శించారు. మరణానంతరం రాజమ్మ కళ్ళు దానం చేయడం పట్ల ఆయన కుటుంబ సభ్యులను అభినందించారు. కందారపు రాజమ్మ నిండు జీవితాన్ని పరిపూర్ణమైన జీవితాన్ని అనుభవించారని, సమాజానికి హితం చేసే బిడ్డలను కన్నారని, అమ్మ గురించి ఓ కవితను వినిపించారు. డాక్టర్ సుద్దాల అశోక్ తేజ వెంట ఆయన భార్య సుద్దాల నిర్మల, ధర్మయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రముఖ రంగస్థల కళాకారులు ధర్మయ్య, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున తదితరులు ఉన్నారు.

## ప్రహరీ నిర్మించండి: ఏఐఎస్ఎఫ్

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహ సముదాయానికి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఆదివారం ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు. మౌలిక వసతులపై ఆరా తీశారు. భోజన నాణ్యతను పరిశీలించారు. వసతి గృహానికి ప్రహరీ గోడ లేకపోవడంతో పందులు, కుక్కలు లోనికి ప్రవేశించి విహరిస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు వాపోయారు. ఫలితంగా విద్యార్థినిలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అభి తదితరులు పాల్గొన్నారు.

# అండర్ 23 ఛాంపియన్స్ జట్టుకు అభినందనలు

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** కడప వేదికగా జరిగిన ఇంటర్ డిస్టిక్ అండర్ 23 వన్డే మ్యాచ్ లలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు ఛాంపియన్స్ గా నిలిచింది. ఈ మేరకు సోమవారం ఓ ప్రముఖ హోటల్లో ఛాంపియన్స్ గా నిలిచిన జట్టును చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్(సిడిసిఏ) ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు విజయకుమార్ (క్రికెట్ విజయ్) మాట్లాడుతూ జిల్లా అసోసియేషన్ వచ్చిన సంవత్సరంలోనే క్రికెట్ క్రీడాకారులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అందులో భాగంగా నాణ్యమైన క్రికెట్ అందించాలనే ఉద్దేశంతో అండర్ 12 అండర్ 14,అండర్ 16,అండర్ 19,అండర్ 23,సీనియర్ జట్లకు ఎక్కువ మ్యాచులు నిర్వహిస్తున్నడం వలన క్రీడాకారులు మరింత ఉన్నత క్రికెట్ ఆడగలుగుతున్నారని సూచించారు. ఎక్కువ ప్రాక్టీస్ మ్యాచులు ఆడడం వలన అన్ని కేటగిరీలలో ఉత్తమ ప్రతిభను కనబరుస్తూ ఛాంపియన్స్ గా నిలుస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు అండర్ 15 ఉమెన్స్, సీనియర్స్ ఛాంపియన్స్ గా నిలువగా, మొన్న కడప వేదికగా జరిగిన ఇంత డిస్టిక్ వన్డే మ్యాచ్లో కూడా అండర్ 23 జట్టు ఘన విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఈ మేరకు నేడు ఛాంపియన్స్ జట్టును సన్మానించడం జరిగిందని, జిల్లా క్రికెట్ క్రీడాకారులకు సిడిసిఏ ఎప్పుడు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిడిసిఏ కార్యదర్శి రవి,కోశాధికారి గిరి ప్రకాష్, ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ సతీష్ యాదవ్, సభ్యులు కోలా హరిప్రసాద్, దివాకర్, రవి, మార్కండేయులు, సత్య శ్రీనివాస్, గాలి వేణుగోపాల్ నాయుడు, శివప్రసాద్, రమణ, ప్రకాష్, కోచ్ లు సునీల్,చిన్నబాబు,అనిత, సీనియర్ రంజీ ప్లేయర్ రాకేష్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

### ఆగస్టులో జూనియర్స్ సిపిఎల్ వన్ ప్రారంభం

**- క్రికెట్ విజయ్**

చిన్న వయసు నుంచి క్రికెట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు మంచి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో సిపిఎల్ వన్ తరహాలోనే ఆగస్టు నెలలో జూనియర్ సిపిఎల్ -1 నిర్వహిస్తున్నట్లు చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్)తెలిపారు. మొన్నటికి మొన్న 17 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల లోపు ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ క్రీడాకారులకు సిపిఎల్ వన్ విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, అదే తరహాలో 12 సంవత్సరాల పైన 16 సంవత్సరాల లోపు వయసుగల క్రికెట్ క్రీడాకారులకు జూనియర్ సిపిఎల్- 1 ఆగస్టులో నిర్వహించనున్నామన్నారు. ఇందులో మొత్తం 6 టీములకు ఫ్రాంచైజీస్ ద్వారా బిడ్డింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే అండర్ 14,అండర్ 16 ప్రాబబుల్ మ్యాచులు నిర్వహించడం జరిగింది అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఎంపిక అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అంతేకాక జూనియర్ సిపిఎల్ వన్ లో ప్రతి టీంలో ఇద్దరు ఉమెన్స్ క్రీడాకారులకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులతో ఐపీఎల్ తరహాలో మ్యాచులు నిర్వహిస్తామన్నారు. 20- 20 ఫార్మేట్ లో జరగనున్న ఈ మ్యాచ్లను దాదాపు 6 కెమెరాలతో ప్రత్యక్ష ప్రసారం ఇవ్వనున్నట్లు తెలిపారు. తద్వారా క్రీడాకారుల ప్రతిభ అందరికీ తెలుస్తుందని, మరింతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను క్రికెట్ ఆడేందుకు ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుందని తెలియజేశారు. సిపిఎల్ వన్ ఎంత గొప్పగా సక్సెస్ అయిందో అంతకుమించి జూనియర్ సిపిఎల్ వన్ సక్సెస్ అవుతుందని క్రికెట్ విజయ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిడిసిఏ కార్యదర్శి రవి,కోశాధికారి గిరి ప్రకాష్, ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ సతీష్ యాదవ్, సభ్యులు కోలా హరిప్రసాద్, దివాకర్, రవి, మార్కండేయులు, సత్య శ్రీనివాస్, గాలి వేణుగోపాల్ నాయుడు, శివప్రసాద్, రమణ, ప్రకాష్, ఫ్రాంచైజ్ ఓనర్స్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

### తిరుపతి మీదుగా బెంగళూరు

## వందే భారత్ రైలుకి ట్రావెల్స్ మాఫియా మోకాలడ్డు..!

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** తిరుపతి పుణ్యక్షేత్రం కావడంతో దేశ విదేశాల నుంచి వేలాదిమంది యాత్రికులు వస్తూ ఉంటారు. యాత్రికుల ప్రయాణ అవసరాలకు సరిపడినంత రైళ్లు రైల్వే శాఖను నడపడం లేదు. యాత్రికుల డిమాండ్ మేరకు వందే భారత రైలు విజయవాడ వయా తిరుపతి టు బెంగళూరు మీదుగా నడిపేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వందే భరత్ రైలు తిరుపతి మీదుగా బెంగళూరు వెళ్లే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అయితే ఈ రైలు రానీకుండా ట్రావెల్స్ మాఫియా ఇటు తిరుపతిలో అటు విజయవాడలో చక్రం తిప్పుతుండటంతో ఈ రూట్లో వందేమాత రైలు ఆలస్యం అవుతుంది. ప్రస్తుతం హైదరాబాదు తిరుపతి మధ్య ఒక వందే భారత్ ఎక్స్ప్రెస్ మాత్రమే నడుస్తోంది. తిరుపతి వయా విజయవాడ మీదుగా వందేభారత్ లేకపోవడంతో యాత్రికులు ఇబ్బందులు పడుతున్నారు. తిరుపతి వాసులు విజయవాడ వెళ్లాలంటే నిత్యం రద్దీతో రైళు నడుస్తూ ఉంటాయి. ఈ మార్గంలో నుడుస్తున్న రైళ్ల సంఖ్య తక్కువగా ఉండడంతో ప్రయాణికుల అవస్తలు అన్ని ఇన్ని కావు. స్వప్రయోజనాల కోసం ప్రజా ప్రయోజనాలను ఫణంగా పెట్టడం తిరుపతి, విజయవాడ రాజకీయానికే చెల్లుతుందని ప్రయాణీకులు విమర్శిస్తున్నారు. అన్నీ సిద్ధంగా ఉన్నా వందే భారత్ రైలును మంజూరు చేయకుండా స్థానిక రాజకీయం అడ్డు పడుతోంది. ఏడాదిన్నర క్రితమే వందే భారత్ ర్యాక్ మెయింటెయినెన్స్ డిపో సిద్ధమైనా, సాంకేతిక సమస్యలు, రైళ్లు లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. తిరుపతి నుంచి బెంగళూరుకు ఎక్కువ మంది ఐటి ఉద్యోగులు, వ్యాపారులు వెళుతూ ఉంటారు. బెంగళూరులో చాలామంది తిరుపతి జిల్లా వాసులు ఉంటున్నారు. వారిని చూసేందుకు వారి తల్లిదండ్రులు ఎక్కువగా రైళ్లను ఆశ్రయిస్తూ ఉంటారు.

### రైళ్లు రాకుండా అడ్డుపడుతున్న ట్రావెల్స్ మాఫియా..!

విజయవాడ వయా తిరుపతి మీదుగా బెంగుళూరుకు డైరెక్ట్ ట్రైన్స్ లేవు. పైనుంచి వచ్చే రైళ్లలో విజయవాడ కోటా పెద్దగా ఉండదు. దీంతో టిక్కెట్లు దక్కడం దాదాపు అసాధ్యం. విజయవాడ, తిరుపతి, బెంగుళూరు మధ్య ట్రావెల్స్ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. నిత్యం పెద్ద సంఖ్యలో ట్రావెల్స్ బస్సులు బెంగుళూరుకు నడుస్తుంటాయి. సాయంత్రం ఆరు నుంచి రాత్రి 9 గంటల మధ్యలో విజయవాడ నుంచి పెద్ద సంఖ్యలో బెంగుళూరుకు ట్రావెల్స్ బసు నడుస్తుంటాయి. 12-13 గంటల ప్రయాణ సమయమైనా ఈ బస్సుల్లో టిక్కెట్లకు ఎప్పుడు డిమాండ్ ఉంటోంది. ఇలాంటప్పుడు వందే భారత్ రైలు వస్తే ట్రావెల్స్ వ్యాపారానికి కొతమేర గండి పడుతుంది. ప్రయాణ సమయం తగ్గిపోతుంది. ఇప్పటికే రైళ్ల రాకపోకల షెడ్యూలు కూడా ఖరారు చేశారు. గత మేలోనే వందే భారత్‌కు పాలనాపరమైన అనుమతులు లభించగా, ట్రైన్ సర్వీస్ జూన్లో మొదలు కావాల్సిఉంది. విజయవాడ నుంచి తిరుపతి మీదుగా 9గంటల్లోనే బెంగుళూరు చేరుకునేలా ప్రయాణ సమయాన్ని ఖరారు చేశారు. వందే భారత్‌ఖు రైల్వే బోర్డు అనుమతించగానే ట్రావెల్స్ వ్యాపారులు రాజకీయ నేతల్ని ఆశ్రయించారు. తమ వ్యాపారాలు దెబ్బతింటాయని ఒత్తిడి చేయడంతో వందే భారత్‌కు అనుమతి రాలేదు.

### పరిమిత రైళ్లతో ప్రయాణాల అవస్థలు

విజయవాడ వయా తిరుపతి మీదుగా బెంగుళూరు వైపు పరిమిత సంఖ్యలో రైళ్లు ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ నుంచి ప్రస్తుతం యశ్వంతపూర్ రైలు మాత్రమే బెంగుళూరుకు ఉంది. విజయవాడ మీదుగా ప్రయాణించే ఇతర జోన్ల రైళ్లలో డివిజన్ కోటా సీట్లు ఉండవు. దీంతో విజయవాడ నుంచి బెంగుళూరు వెళ్లాలనుకునే సగటు ప్రయాణికులకు సీట్లు దక్కే పరిస్థితి లేదు. దశాబ్దాలుగా విజయవాడ వయా తిరుపతి మీదుగా బెంగుళూరుకు డైరెక్ట్ ట్రైన్ వేయకపోవడానికి ట్రావెల్స్ రాజకీయమే కారణమని రైల్వే వర్గాలు స్పష్టం చేశారు. ప్రైవేట్ ట్రావెల్ బస్సుల వ్యాపారాన్ని కాపాడేందుకే ప్రజా ప్రతినిధులు కొత్త రైళ్లను రాకుండా అడ్డుపడుతున్నారని తెలుస్తోంది. సుదీర్ఘ ప్రయత్నాలు, రైల్వే అధికారుల చొరవతో కొత్త రైలును తిరుపతి మీదుగా బెంగుళూరుకు నడిపేందుకు రైల్వే శాఖ అనుమతించినా మళ్లీ రాజకీయం అడ్డుపడింది.

### ఇదీ వందే భారత్ రైలు షెడ్యూలు

వందే భారత్ రైలుతో బెంగళూరు వెళ్లే వారితో పాటు తిరుపతి వెళ్లే భక్తులకు కూడా అనువుగా ఉంటుంది. మొత్తం 8 బోగీల్లో 7 ఏసీ చైర్ కార్ బోగీలు, ఒక ఎగ్జిక్యూటివ్ చైర్ కార్తో ఈ సర్వీస్ నడుపుతారు. వారంలో మంగళవారం మినహా ఆరు రోజులు నడిచేలా షెడ్యూల్ ఖరారు చేశారు. ట్రైన్ నంబర్ 20711 విజయవాడ- బెంగుళూరు వందే భారత్ విజయవాడలో ఉదయం 5.15 బయలుదేరి తెనాలి 5.39కు చేరుతుంది. ఒంగోలు 6.28, నెల్లూరు 7.43, తిరుపతి 9.45, చిత్తూరు 10.27, కాట్పాడి 11.13 కృష్ణరాజపురం 13.38, ఎస్ఎంవీటీ బెంగళూరు మధ్యాహ్నం 14.15 గంటలకు చేరుతుంది.

# మామిడి రైతులు నష్టపోకూడదు

- గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో పెరిగిన ఉత్పత్తి
- కలెక్టర్ సమన్వయ సమావేశాలతో రైతులకు లబ్ధి
- ప్రజాశక్తి ముఖాముఖిలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి

**ముఖా ముఖి**

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా లక్షల ఎకరాల్లో తోతాపూరి మామిడి రకాన్ని రైతులు సాగు చేస్తున్నారు. ప్రతి ఏడు ఉద్యాన శాఖ సూచనలతో రైతులకు మంచి దిగుబడి వచ్చేలా గడిచిన ఇన్నేళ్లుగా అధికారులు తగిన తోడ్పాటును అందించడం జరిగింది. అయితే గత ఏడాదితో పోలిస్తే వాతావరణ పరిస్థితుల కారణం, అత్యధిక దిగుబడి రావాలని రైతులు చేసిన ప్రయత్నాల మూలంగా తోతాపూరి మామిడి రకం ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో దాదాపు ఆరు లక్షల టన్నులకు పైగా దిగుబడి రావడం, ఇదే సమయంలో గుజ్జు పరిశ్రమలు గత ఏడాది పల్ప్ అలానే ఉండిపోయిందంటూ ప్రకటించడంతో రైతులు నిరసనలకు దిగడం జరిగింది. రైతులకు మేలు చేకూర్చేలా రాష్ట్ర ప్రభుత్వం గుజ్జు పరిశ్రమలతో కలెక్టర్ల ద్వారా సమన్వయ సమావేశాలు నిర్వహించి రైతుకు మద్దతు ధర ఇవ్వడానికి పరిశ్రమలు కూడా సహకరించాలని పరిశ్రమలు రూ.8, ప్రభుత్వం నుండి రూ.4 రూపాయల మద్దతు ధరను మొత్తం కలిపి 12 రూపాయలు కేజీ తోతాపూరికి అందేలా ఉత్తర్వులను ఇచ్చింది. దీనిని అమలు చేయడానికి తిరుపతి జిల్లాలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉద్యాన శాఖ, లైన్ డిపార్ట్మెంట్‌లతో కలిసి సమన్వయ సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా రైతులకు మేలు చేకూర్చేలా శ్రమించామని జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఈ ఏడాది తోతాపూరి మామిడి రకంకు ఏర్పడిన గడ్డు పరిస్థితులకు సంబంధించి ప్రజాశక్తి ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించింది.

**ప్రజాశక్తి:** తిరుపతి జిల్లా పరిధిలో ఈ ఏడాది తోతాపూరి మామిడి రకం ఎంత దిగుబడి వచ్చింది?

**అధికారి:** తిరుపతి జిల్లాలో ఈ ఏడాది గత ఏడాదితో పోలిస్తే తోతాపూరి మామిడి రకం అత్యధిక దిగుబడిని ఇచ్చింది. ఇందుకు కారణం వాతావరణ పరిస్థితులు, రైతుల ఎరువుల వినియోగం. ఏడాది కాపు కూడా ఆలస్యం కావ డంతో 1.45 టన్నుల మామిడి దిగుబడి వచ్చింది. ఇందులో గృహ వినియోగం రైతు ముందస్తుగా కాయలు కోయడం వలన దాదాపు 30 వేల టన్నులు గృహ వినియోగాలకు వినియోగించబడ్డాయి. ప్రజ లు తినడానికి 10 నుండి 15 టన్నుల కలర్ కాయలు బయట ప్రాంతాలకు సరఫరా చేయబడ్డాయి. ఈరోజు వరకు దాదాపు 82 వేల టన్నులు తోతాపూరి మామిడిని తిరుపతి జిల్లాలో అందుబాటులో ఉన్న ఎనిమిది గుజ్జు పరిశ్రమలకు క్రమ పద్ధతిలో తరలించడం జరిగింది. రెండు మూడు రోజుల్లో మిగిలిన దాదాపు పదివేల టన్నుల మామిడికాయలను గుజ్జు పరిశ్రమలు తీసుకునే విధంగా చర్యలు అమలు చేస్తున్నాం.

**ప్రజాశక్తి:** గత ఏడాది తోతాపూరి దిగుబడి ఎంత, దాని మద్దతు ధరను వివరించండి?

**అధికారి:** ఈ ఏడాదితో పోలిస్తే గత ఏడాది తిరుపతి జిల్లాలో తోతాపూరి మామిడి రకం 70 నుండి 80 వేల టన్నులు వచ్చింది. గత ఏడాది రైతుకు ఒక కేజీకి రూ.18 నుంచి రూ.26 రూపాయలు ధర పలికింది. గత ఏడాది ఒక్క తోతపూరి మామిడికాయ బరువు 350 గ్రాములుగా దిగుబడి వచ్చింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడు దిగుబడి అయిన మామిడికాయ 600 గ్రాముల నుండి 700 గ్రాముల వరకు కాయ బరువు పెరిగింది. గత ఏడాది వచ్చిన లాభాలు ఏడాది కూడా అర్జించాలని రైతు కష్టించి క్రాప్ అత్యధిక దిగుబడి వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవడం, నైరుతి ఋతుపవనాల ఆగమనం వీటితో కొద్దిగా ఇబ్బందికర వాతావరణం అనేది ఏర్పడింది.

**ప్రజాశక్తి:** మన తిరుపతి జిల్లాలో ఉన్న 8 గుజ్జు ఫ్యాక్టరీలు రోజుకు ఎన్ని వేల టన్నులను రైతుల నుండి వినియోగానికి తీసుకున్నారు?

**అధికారి:** తిరుపతి జిల్లా పరిధిలో ఉన్న 8 గుజ్జు పరిశ్రమలు ఒక రోజుకు రైతు వద్ద నుండి టోకెన్ సిస్టం ద్వారా 1500 వందల నుండి 2000 టన్నులు తీసుకున్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న మండీలు, ర్యాంపుల వద్ద రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ, రెవిన్యూ శాఖ, గ్రామ వార్డు సచివాలయ సిబ్బందితో ఒక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసి రైతులకు ఎక్కడ ఇబ్బంది జరగకుండా జూమ్ సమావేశాలను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ నిర్వహించి ఎప్పటికప్పుడు తగు సూచనలు ఇచ్చారు. దీంతో గుజ్జు పరిశ్రమల వద్ద ప్రత్యేక నిఘా కోసం రెండు డ్రోన్ కెమెరాలను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. వీటన్నింటి సమన్వయంతో రైతుకు అంతిమంగా మేలు జరిగిందని ఆశిస్తున్నాం. రైతుకు కొన్ని గుజ్జు పరిశ్రమల నుండి ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ. 8 రూపాయలు కాకుండా తక్కువ ఇచ్చినట్లుగా కూడా తమ దృష్టికి వచ్చింది.

**ప్రజాశక్తి:** తోతాపూరి మామిడి రైతులను ఆదుకోవడానికి జిల్లా యంత్రాంగం అమలు పరిచిన ప్రణాళికను వివరించండి?

**అధికారి:** తిరుపతి జిల్లా పరిధిలో ఈ ఏడాది అత్యధిక దిగుబడి రావడంతో రైతులను ఆదుకోవడానికి, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ సూచనలతో దాదాపు రెండు నెలలుగా రైతు సంఘాల నాయకులు, గుజ్జు పరిశ్రమలు, చిత్తూరు, తిరుపతి జిల్లాల జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలు, వివిధ శాఖల నుండి విధుల్లో ఉన్న అధికారులతో సమన్వయ సమావేశాలు ఫలితాలను ఇచ్చాయి. దాదాపు 180 నుండి 200 మంది సిబ్బంది తోతాపూరి మామిడి రకానికి రైతుకు ఎక్కడా నష్టం కలగకుండా శ్రమించాం. అమలు చేస్తున్న చర్యలుపై గుజ్జు ఫ్యాక్టరీల వద్దకు ఆకస్మిక తనిఖీలను చేయడం జరిగింది.

## సూళ్లూరుపేటలో కార్డన్ సెర్చ్

**ప్రజాశక్తి - సూళ్లూరుపేట :** సూళ్లూరుపేట, మహదేవయ్య నగర్, క్రిస్టియన్ పేటలో ఆదివారం ఉదయం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ ఎం.మురళీకృష్ణ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై, అనుమానిత వ్యక్తులపై సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎస్ఐ బ్రహ్మనాయుడు, తడ ఎస్ఐ కొండప నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువశ్రీ మురళికి సత్కారం

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** కర్నూలు వేదికగా శని, ఆదివారం రెండు రోజుల పాటు జరిగిన తెలుగు భాషా పరిరక్షణ సదస్సులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని, తిరుపతి వేదికగా జరిగిన తెలుగు భాషోద్యమం, భాషా పరిరక్షణ, భాషాభివృద్ధి, ప్రస్తుతం తెలుగు భాష కోసం చేస్తున్న కృషికి గాను తిరుపతి జిల్లా ప్రతినిధిగా సదస్సులో పాల్గొని భాషాభివృద్ధికి తీసుకోవాల్సిన విధానాలను వివరించారు. పంచుకున్నందుకు మాజీ మంత్రివర్యులు టి.జి.వెంకటేష్ చేతుల మీదుగా యువశ్రీ మురళి తెలుగు బిడ్డ జ్ఞాపిక అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చంద్రశేఖర్, శర్మ, పార్వతిదేవి, ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యా దానం మహా దానం

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్:** విలువలతో కూడిన విద్యను అందించడంలో గురువులతో పాటు తల్లిదండ్రులు కూడా సహకరించాలని పుత్తూరు ఉపవిద్యాశాఖాధికారి మహేశ్వర రావు కోరారు. పుత్తూరు ప్రధాన పాఠశాలలో జరిగిన శ్రీ సరస్వతి మాతా సాంఘిక సేవా సమాజం సమావేశంలో విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. సమాజ సేవలో విశేష కృషి చేస్తున్న మాదా ప్రసాద్, వారి కుమారులను ఆయన అభినందించారు. దాదాపు 3 లక్షల విలువైన బోధనా సామగ్రిని, 6 మండలాల్లోని 25 పాఠశాలలకు చెందిన 750 మంది విద్యార్థులకు సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయుల సమక్షంలో ఉపవిద్యాశాఖాధికారి ద్వారా అంద చేశారు. అనంతరం మండల, పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు దాతల ద్వారా నగదు మరియు జ్ఞాపికలు అందించారు. ఇద్దరు అనాథ విద్యార్థులకు శ్రీసాయిజ్యోతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుటకు ఆర్థిక సహాయం సంస్థ సభ్యులు అందించారు. ఈ సమావేశంలో కె రవి, జె దొరస్వామి, ఆర్.ప్రభాకర్ రాజు, కె పార్థ సారధి, కె . జె విజయ్ బాబు, సంతోష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా..

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** నగరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సికే కార్తికేయన్ పేర్కొన్నారు. పుత్తూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటు గారి భాస్కర్ విచ్చేశారు. ఈ సందర్భంగా సీకే కార్తికేయన్ మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో త్వరలో కాంగ్రెస్ పార్టీకి అన్ని కమిటీలను ఏర్పాటు చేసుకొని గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసుకుంటూ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ నగరి నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని సమస్యలపై పోరాడుతానని తెలిపారు.

## గ్రాప్లింగ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు

**ప్రజాశక్తి - క్యాంపస్ :** ఆంధ్రప్రదేశ్ గ్రాప్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు తిరుపతిలోని గిరిజన భవన్ ఇండోర్ హాల్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో సబ్-జూనియర్, క్యాడెట్ (బాయ్స్ అండ్ గర్ల్స్) విభాగాల్లో రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏపీ క్రీడా భారతి అధ్యక్షులు ఎం.వి. మణిక్యులు (ఒలింపియన్), సి. చంద్రయ్య, ఏపీ క్రీడా భారతి కార్యదర్శి పి.ధనంజయ రెడ్డి, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి సతీరెడ్డి, వివిధ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ విశ్వచందన్ రెడ్డి, ఎస్.జి.ఎఫ్ తిరుపతి జిల్లా మాజీ కార్యదర్శి జయచాయ్య, ఏపీ ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి మురళీకృష్ణ, ఏపీ గ్రాప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.జి. రేఖా రాణి, విప్లవర్ధనులు పాల్గొన్నారు ఏ.పి. స్పోర్ట్స్ క్రీడ భారతి జాయింట్ సెక్రటరీ, సభాధ్యక్షులు సురేంద్ర రెడ్డి తెలిపారు.

## డెంగీ వ్యాధిపై అవగాహన

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** రూరల్ మండలం, వేపగుంట పంచాయతీలో ఆదివారం పరమేశ్వర మంగళం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హేమనాథ రెడ్డి ఆధ్వర్యంలో డెంగీ నివారణపై ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా పుత్తూరు ఎంపీపీ మునివేలప్ప విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమంత్ రెడ్డిరెడ్డి డెంగ్యూ వచ్చే జాగ్రత్తలు పాటించాలని, చుట్టుపక్కల ప్రాంతాల్లో మురికి నీరు, పరిశుభ్రంగా లోపం లేకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అప్పుడే దోమలు చేరవని, దోమల వల్ల అనేక వ్యాధులు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గిరిజ ప్రసాద్ ఆశవర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలు తొలగించండి

**ప్రజాశక్తి - రేణిగుంట:** రేణిగుంట మండలం, గుత్తివారిపల్లి దళితవాడలో ఎంతో కాలంగా వాడుకున్న బాటను ఆక్రమించి కొందరు భవనాల ప్రహరీ నిర్మాణాలు చేపట్టారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమ నిర్మాణాలను తొలగించాలని తిరుపతి జిల్లా రైతు సంఘం అధ్యక్షులు రంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆక్రమ కట్టడాలను తొలగించాలని లేని యెడల త్వరలో పెద్ద ఎత్తున తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు.

# ఏ నిమిషానికి... ఏమి జరుగునో..!

■ శిథిలావస్థలో తహశీల్దారు కార్యాలయం ■ 40 యేళ్ల క్రితం నిర్మించిన భవనంలో కార్యకలాపాలు ■ మోగుతున్న ప్రమాద ఘంటికలు

ప్రహరీ కూలి.. రక్షణ కరువు



సీలింగ్ పెచ్చులూడి..

**ప్రజాశక్తి-తొట్టంబేడు :** మండలంలో మొత్తం 27 పంచాయతీలు 41 గ్రామాలున్నాయి. గ్రామాల్లో నివసించేవారు ఎక్కువ శాతం మంది రైతులు. వీరిలో చాలావరకు కొద్దో, గొప్పో పంట భూములను కలిగి ఉన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఏదో ఒక సర్వే పేరుతో గ్రామాల్లో ఉన్న రైతులు తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి వెళ్లాల్సిందే. అలాగే భూ సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించుకోవడానికి, ఏదో ఒక సమస్య మీద నిత్యం తొట్టంబేడు మండల తహశీల్దార్ కార్యాలయానికి ప్రజలు వస్తుంటారు. సమస్యల పరిష్కారం కోసం వస్తున్న వారికి అధికారులు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తున్నారు.

ఇంతవరకు బాగానే ఉంది. అసలు విషయానికి వస్తే.. తొట్టంబేడు మండల తాసిల్దార్ కార్యాలయం భవనం నిర్మించి ఇప్పటికీ 40 సంవత్సరాలు కాలం పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. ఈ కార్యాలయ భవనం పరిస్థితి చూస్తుంటే ఏ నిమిషానికి.. ఏమి జరుగుతుందో అని అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారుల మదిలో మెదులుతున్న ప్రశ్న. ఈ భవనం స్లాబ్ నుంచి అప్పుడప్పుడు పెచ్చులు ఊడిపడడం, స్లాబ్‌లో ఉన్న ఇనుప చువ్వలు బయటకు కనబడుతున్నాయంటే ఈ భవనం ఏ పరిస్థితుల్లో ఉందో ఇట్టే అర్థమయిపోతుంది. ఈ కార్యాలయంలో మొత్తం పై స్థాయి అధికారుల నుంచి కిందిస్థాయి అధికారులు అంతా కలిపి సుమారు 40 మంది నిత్యం విధులు నిర్వహిస్తూ ఉంటారు. నిత్యం కార్యాలయానికి మండలంలో ఉన్న ప్రజలు భూ సమస్యలు, జనన, మరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయానికి వస్తూనే ఉంటారు. మరి ఇంత మంది సిబ్బంది విధులు నిర్వహిస్తూ, ఇంత మంది ప్రజలు నిత్యం వచ్చే ఈ కార్యాలయం భవనం ఇలా ఉంటే ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇక రాబోయేది వర్షాకాలం. రాబోయే వర్షాలకు భవనం పూర్తిగా తడిసి ఏదైనా ప్రమాదం జరుగేట్టుందని సిబ్బంది, కార్యాలయానికి వచ్చిపోయేవారు ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరం కురిసిన వర్షాలకు ప్రహరీ గోడ బాగా తడిసి కొంతమేర గోడ కూలిపోయి కార్యాలయానికి భద్రత కొరత ఏర్పడింది. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి తహశీల్దార్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### తహశీల్దార్ భారతి వివరణ

ఈవిషయంపై తొట్టంబేడు మండల తహశీల్దార్ భారతిని వివరణ కోరగా ఈ భవనం నిర్మించి ఇప్పటికీ 40 సంవత్సరాలు పూర్తి అయిందని, కాబట్టి భవనం పరిస్థితి బాగాలేని విషయం వాస్తవమే అని అన్నారు. గతంలో ఉన్న అధికారులు నూతన భవన నిర్మాణం కోసం పై అధికారులకు నివేదిక పంపి ఉన్నారని, తొందర్లోనే నూతన భవనం నిర్మించడానికి కృషి చేస్తామని తెలిపారు.

# క్రైం న్యూస్

## విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి

మృతి చెందిన ముత్తర్ హుస్సేన్

**ప్రజాశక్తి - రేణిగుంట:** రేణిగుంట మండలం, తుకివాకం పంచాయతీ, ఎర్రం రెడ్డి పాలెం వద్ద ఆదివారం విద్యుత్ షాక్ తగిలి ప్రమాదవశాత్తు 10 సంవత్సరాల బాలుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే అస్సాంకు చెందిన 50 కుటుంబాలు వలస కూలీలుగా తిరుపతి మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ముత్తర్ హుస్సేన్(10) ఆడుకుంటూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గాజుల మండలం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, నలుగురికి గాయాలు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** ముందు వెళుతున్న లారీని కారు అధిగమించబోయి వెనుక నుంచి ఢీ కొట్టిన సంఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందగా, ఇంకో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి మదనపల్లి-నాయుడుపేట జాతీయ రహదారి స్వర్ణముఖి నది వంతెనపై చోటు చేసుకుంది. టూ టౌన్ పోలీసుల కథనం మేరకు వివరాలు.. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తూర్పు కనుపూరుకు చెందిన మనోజ్ కృష్ణ, బాల సాయి స్నేహితులు. వీరు మరో ముగ్గురు స్నేహితులను కలుపుకొని శనివారం రాత్రి కారులో తిరుమల దర్శనార్థం బయలుదేరారు. ఈ క్రమంలో శ్రీకాళహస్తి స్వర్ణముఖి నది వంతెన పై ముందు వెళ్తున్న లారీని అధిగమించబోయి వెనుక నుంచి ఢీ కొట్టారు. ఈ సంఘటనలో కారు ఎడమవైపు ముందు భాగంలో కూర్చున్న మనోజ్ కృష్ణ (22) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. స్నేహితులు బాల సాయి, అజయ్, అభిలాష్ పవన్‌లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. మృతుడు మనోజ్ కృష్ణ తూర్పు కనుపూరుకు చెందిన రాజేంద్ర, రామసుబ్బమ్మల చిన్న కుమారుడు. అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేసి ఇంటి వద్ద తండ్రికి వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉన్నాడు. స్నేహితులతో కలిసి కోటకు వెళ్ళొస్తానంటూ ఇంట్లో అబద్ధం చెప్పి తిరుమల వెళ్తుండగా మార్గమధ్యంలో ఈ ఘటన జరిగింది. టూ టౌన్ పోలీసులు మనోజ్ కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

## కొల్లాపూరమ్మ ఆలయాన్ని దర్శించిన పీఠాధిపతి సింహయాజి

### ఆధ్యాత్మిక సమాజసేవకులు శివప్రసాద్ రెడ్డిని ప్రశంసించిన పీఠాధిపతి

**ప్రజాశక్తి - యర్రావారిపాలెం:** ప్రముఖ సమాజ సేవకులు, ఆధ్యాత్మిక పెద్దలు శివ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రంగన్నగారి గడ్డ కొల్లాపురం దేవాలయాన్ని నెల్లూరుకు చెందిన పీఠాధిపతి సింహయాజి తన అనుచర భక్తులతో కలిసి ఆదివారం అమ్మవారి దర్శనార్థం విచ్చేశారు. ఆలయ నిర్వాహకులు పీఠాధిపతికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం పీఠాధిపతి సింహయాజి మాట్లాడుతూ తిరుమల శేషాచల సప్తగిరి యాత్రలో భాగంగా కొల్లాపురమ్మ, దేవరకొండ ఆలయాలను దర్శించుకున్నామని తెలిపారు. కొల్లాపూరమ్మ ఆలయం, నెమలిగుండ్లు, దేవరకొండ ఆలయాల ప్రతిష్టను వాటి చరిత్రను గురించి తిరుమల శేషాచల సప్తగిరిలకు దేవతలు సంచారం చేస్తున్నారని ఇతిహాసాలు పురాణాలు ఆధారంగా నిరూపణ అయిందని పీఠాధిపతి పేర్కొన్నారు. అదేవిధంగా మానవసేవే మాధవసేవ అని ఎందరో అనాథ వృద్ధులకు కోసం సొంత నిధులతో 6 కోట్లు వెచ్చించి తన తండ్రి వి.సిద్ధిరాంరెడ్డి జ్ఞాపకార్థం అనాథ ఆశ్రమం నిర్మించడం, తలకోనలో అన్నదాన సత్రం నిర్మించడం, ఉచిత కళ్యాణ మండపం ఇలా ఎన్నో ఆధ్యాత్మిక నిర్మాణాలు నిర్మించి సేవలు చేస్తున్నారని శివప్రసాద్ రెడ్డి కుటుంబాన్ని పీఠాధిపతి సింహయాజి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వంకి పెంచలయ్య, విసి ఆదిశంకర యూనివర్సిటీ, బైద్యనాథ్ గోస్వామి, శేఖర్ రెడ్డి మహర్షి వేదిక యూనివర్సిటీ డైరెక్టర్, రోహిత్ పాండే, సుప్రీంకోర్టు బార్ కౌన్సిల్ మెంబర్, సి.ఆదినారాయణ తిరుమల సప్తగిరిల ప్రదక్షణ కమిటీ ప్రెసిడెంట్, భక్తులు పాల్గొన్నారు.

## వ్యర్థాల తొలగింపు.. ప్రజాశక్తి వార్తకు స్పందన

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** పట్టణంలోని కైలాసగిరి కాలనీలో పేరుకుపోయిన వ్యర్థాలను, చెత్తకుప్పలను ఆదివారం మున్సిపల్ పారిశుద్ధ్య విభాగం కార్మికులు తొలగించారు. ప్రజాశక్తిలో 'ఈ చెత్తకు మోక్షమెప్పుడో!' అన్న శీర్షికన ఆదివారం కథనం వెలువడింది. స్పందించిన మున్సిపల్ అధికారులు హుటాహుటిన కైలాసగిరి కాలనీలో పారిశుద్ధ్య విభాగం కార్మికుల చేత వ్యర్థాలను తొలగించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

## బలిజ పెద్దలకు సత్కారం



**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** కాపు, తెలగ, బలిజ రిజర్వేషన్ కోసం శ్రీకాళహస్తి నుంచి అమరావతికి పాదయాత్ర చేసిన శ్రీకాళహస్తి నియోజకవర్గ బలిజ పెద్దలకు ఆదివారం ఘన సత్కారం చేశారు. రద్దు చేసిన బలిజ రిజర్వేషన్లు మళ్లీ అమలు చేయాలంటూ సాన ప్రసాద్, దండి రాఘవయ్య, ముఖ్యం వెంకట్రామయ్యలు సుమారు 858 కిలోమీటర్లు పాదయాత్ర చేసి అమరావతి చేరుకున్నారు. తిరిగి ఆదివారం శ్రీకాళహస్తికి చేరుకోవడంతో వారిని స్థానిక కాపు నేతలు శ్రీహరి కళ్యాణమండపంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిద్దులు గారి ప్రసా ద్, అంజూరు శ్రీనివాసులు, ఉప్పు కృష్ణయ్య ,పూల కృష్ణయ్య, పసుపులేటి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహాసభలు జయప్రదం చేయండి

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** ఆదివారం సిపిఐ ఈఎస్ఐ శాఖ మహాసభను నరసింహులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిధిగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనాతీరును దయ్యబట్టారు. ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. ఆగస్టు 3న తిరుపతి జిల్లా, సూళ్లూరుపేటలో జరగబోయే సీపీఐ 2వ మహాసభలు జయప్రదం చేయడానికి ప్రతి పార్టీ సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర్ కార్యదర్శి జిల్లా విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## జనార్ధన్ చౌదరికి ఘన సన్మానం

**ప్రజాశక్తి - రామచంద్రాపురం :** రామచంద్రాపురం సింగల్ విండో చైర్మన్‌గా నియమితులైన చేకూరి జనార్ధన్ చౌదరిని ఘన సన్మానించారు. ఆదివారం మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కట్టకింద వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982 – 1983 పదో తరగతి చదివిన పూర్వపు విద్యార్థులు, స్నేహితులు అందరూ కలిసి చేకూరి జనార్ధన్ చౌదరిని దుశ్శాలువులు, పుష్పగుచ్ఛాలతో సన్మానించి జ్ఞాపకలను అందజేసి అభినందనలు తెలిపారు.

## పటేల్ అబ్దుల్ మజీద్ సాహెబ్ మరణం కాంగ్రెస్‌కు తీరనిలోటు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** నిస్వార్థమైన వ్యక్తిగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం 50 ఏళ్లుగా కృషిచేసిన పటేల్ అబ్దుల్ మజీద్ సాహెబ్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ అన్నారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ పటేల్ ఆదివారం మృతి చెందడం జరిగిందన్నారు. పటేల్ భౌతిక కాయాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు.

## సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎస్సీవీ నాయుడు

**ప్రజాశక్తి - తొట్టంబేడు:** శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలం, తంగేళ్లపాలెం పంచాయతీ పరిధి, కత్తి వారి కండ్రిగ, బసవన్న గుంట గ్రామాలలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే ఎస్.సి.వి నాయుడు పాల్గొన్నారు. ఆయన ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టి.డి.పి నాయకులు గాలి మురళి నాయుడు, టిడిపి యువ నాయకులు ఎస్.సి.వి దిలీప్, ఎస్.సి.వి.కిరణ్, సీనియర్ నాయకులు గురు దశరథన్, మోహన్ నాయుడు, గాలి బాలాజీ నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదలకు అండగా ఉంటుందని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.ఎం.ఉమేష్ రావు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మంచినీళ్ళ గుంట ప్రాంతంలో నాయకులు పర్యటించారు. ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలను వివరించి, ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఏడాది పాలన పట్ల నియోజకవర్గ ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి, మిన్నల్ రవి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్య మని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు పేర్కొన్నారు. ఆది వారం తిరపతి 16, 17వ డివిజన్ సిపిఐ శాఖ మహాసభ పళని థియే టర్ వద్ద అల్లా బాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతి థిగా హాజరైన రామానాయుడు మాట్లాడుతూ తిరుపతి స్వచ్ఛ నగరమని గొప్పలు చెప్పుకుంటున్నారు తప్ప డ్రైనేజీ సమస్య విషయంలో వైఫల్యం చెందారన్నారు. 18,19వ తేదీలలో ఆటో నగర్‌లో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్య దర్శి జల్లా విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చలపతి పాల్గొన్నారు.

## మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

**ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్:** ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వెంకటగిరి, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరాన్ని ఉద్దేశించి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, రామారావును వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. శనివారం అర్ధరాత్రి నుండి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేపట్టారని, ఆదివారం టెంట్ లో కూర్చుని నిరసన తెలియచేశారని తెలిపారు. 14, 15 తేదీల్లో వంట వార్పు కార్యక్రమం చేపటడతామని తెలిపారు. 16వ తేదీ నుండి పారిశుధ్య కార్మికులు కూడా సమ్మెలోకి వెళతారని, 17వ తేదీ చలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెక్షన్ వాటర్ విభాగం సిఐటియునాయకులు వెంకటసుబ్బయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారించండి

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరు పట్టణంలోని రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు ఏ.పీ. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో శనివారం అర్ధరాత్రి నుండి నిరవధిక సమ్మెకు శ్రీకారం చుట్టి ఆదివారం ఉదయం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజనీరింగ్ కార్మికులు టెంట్లలోకి వెళ్లి కూర్చోవడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు తమ డిమాడ్లను తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంఘం కార్యదర్శి దారా కోటేశ్వరరావు, పి.భాస్కర్ వై.సుబ్రహ్మణ్యం, కే.బాలయ్య,ఎస్.కామేశ్వరరావు, సి. హెచ్.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## బైరెడ్డి శబరికి ఘన స్వాగతం

**ప్రజాశక్తి - క్యాంపస్ :** తిరుమల పర్యటనే నిమిత్తం విచ్చేసిన టిడిపి పార్లమెంటరీ పార్టీ ఉప నాయకురాలు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి తెలుగు యువత ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీలో ఘనంగా స్వాగతం పలికి సన్మానం చేశారు. అనంతరం ఎస్వీయూలోని వేంకటేశ్వర ఆలయంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఖ్యాతిగాంచిందని, ఇక్కడకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి అనేక మంది విద్యార్థులు వచ్చి పోటీ పరీక్షలకు హాజరవుతుంటారన్నారు. వర్శిటీ ప్రగతి కోసం కృషి చేస్తానని ఆమె సందర్భంగా వివరించారు.

## రౌడీషీటర్లు వారం.. వారం హాజరవ్వాలి

**ప్రజాశక్తి- రేణిగుంట:** రేణిగుంట పోలీస్ స్టేషన్లో రౌడీ షీటర్లు, సస్పెక్ట్‌లు వారానికోసారి వచ్చి హాజరవ్వాలని సీఐ జయచంద్ర తెలిపారు. ఆదివారం రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లు, సస్పెక్ట్‌లకు సిఐ జయచంద్ర కౌన్సిలింగ్ ఇచ్చారు. సక్రమమైన పద్ధతిలో జీవనం సాగించాలని, బెదిరింపులు, రౌడీయిజలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారానికి ఒకసారి వచ్చి పోలీస్ స్టేషన్లో హాజరవ్వాలని లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## జనసేన రౌండ్ టేబుల్ సమావేశం

**ప్రజాశక్తి - రామచంద్రపురం(చంద్రగిరి)** చంద్రగిరి పట్టణ జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జ్ దేవర మనోహర్ ఆధ్వర్యంలో ఆదివారం మండల పార్టీ నాయకులు, ముఖ్య నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవర మనోహర్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి, స్థానిక ఎన్నికల్లో విజయం సాధించడానికి కలిసికట్టుగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని జనసైనికులకు సూచించారు. గ్రామాల్లో పార్టీ కార్యకలాపాలను వేగవంతం చేయడమే లక్ష్యంగా, ప్రతి గ్రామానికి జనసైనికులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో 7 మండలాల అధ్యక్షులు, ఇంచార్జ్‌లు, నియోజక వర్గ ముఖ్య నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

## మేకపిల్ల రమణమ్మకు నివాళి

**ప్రజాశక్తి - తొట్టంబేడు:** తొట్టంబేడు మండలం, కొత్త కండ్రిగయిఐ చెందిన మేక పిల్ల రమణమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న తొట్టంబేడు మండలం వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు డాక్టర్ కోగిల సుబ్రహ్మణ్యం రమణమ్మ భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వై.సి.పి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (JUNIOR DIVISION) OF CHITTOOR**
**O.S.No. 741 of 2019**

Between:
G.B.Mushtaq Ahamad .... Plaintiff
And:
SK. Murad Shahvali & others, .... Defendants

**SUMMONS TO THE DEFENDANT NO.2 TO 5**

TO:
D2 TO D5
**2) Feroz Begum,** W/o SK.Murad Shahvali,
**3) Hanif,** S/o Late SK.Murad Shahvali,
**4) Althaf** S/o Late SK.Murad Shahvali,
**5) Humera,** W/o Late SK.Murad Shahvali,
**All are residing at: D.No.18-1-281/A, FBM SAM Apartments, Bhavani Nagar, Tirupati town & District.**

Please take notice that the above named plaintiff filed the above suit against all of you for recovery of suit amount due to the plaintiff and for other reliefs and the above suit is posted for your appearance before the Hon'ble court on **19.08.2025**. Please be present on the said date before the Hon'ble court at about **10:30 AM** either in person or through an advocate and to raise objections if any, failing which, the matter will be decided exparte in your absence.

Place:Chittoor **K.SATHYA MOORTHY**
Date:13.07.2025 Advocate,Chittoor

**మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**ఒ.ఎస్ నెం: 20 / 2024**

దుద్ద వెంకట కృష్ణారెడ్డి ...వాది
వెర్సెస్
ఏలూరు మునిరత్నం ...ప్రతివాది

**నోటీసు**

టు
ఏలూరు మునిరత్నం, తండ్రి వెంకటేశ్వర్లు, C/o నాయుడుపేట మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్, స్వర్ణముఖి నది ప్రక్కన, వేంకటగిరి రోడ్డు, నాయుడుపేట టౌన్ మరియు మండలం, తిరుపతి జిల్లా.

ఇందుమూలముగా తెలియచేయడము ఏమనగా పై నెంబర్ కేసు నందు వాది ప్రోనోటు బాకీ రాబట్టుకొనుటుకు దరఖాస్తు దాఖలు చేసుకోగా గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు మీకు నోటీసు నిమిత్తం 29-07-2025వ తేదికి వాయిదా వేసియున్నారు. కావున మీకు ఎట్టి అభ్యంతరములు ఉన్నయెడల పై తెలిపిన కోర్టు నందు 29-07-2025వ తేదీ ఉదయం గం.10-30 లకు స్వయంగా కానీ వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల ఎటువంటి అభ్యంతరములు లేనట్లుగా నీ పరోక్షమున తీర్మానించబడును.

**ఎస్.కే. యూసుఫ్ హుస్సేన్,**
ఎం.ఏ., ఎల్.ఎల్.బి.,

**PUBLIC NOTICE**

The General Public is hereby informed that as per instructions of my client K UMAPATHI S/O K CHENGAIAH Resident of D.No.2-79/1, Thondawada village, Thondawada Grama panchayat and village accounts, Chandragiri Mandal, Tirupati District approached my Client's Bank I.e., IndusInd Bank ltd., Tirupati branch with a request to advance of Housing Loan By mortgaging his property described below:

**DESCRIPTION AND LOCATION OF THE PROPERTY**

Property Situated at Chittoor District at present Tirupati District – Sri Balaji registration Dist – Tirupati – Chandragiri Sub – District – Chandragiri mandal – No.61 – Thondawada Grama Panchayathi – Thondawada village Accounts – Sy.No.219/1, in which RCC Building bearing D.no.2-79/1, Bounded on **East :**Lane and House of K.Umapathi **West:** House of bondu Nadhamuni Reddy **North :** House of Virupakshi Janikiramareddy **South :**House of Proddatur Munisankar reddy With in these Boundaries **1St Item:-** East to west – 34 ft or 10.370 mts North to south – 22 ft or 6.710 mts Total 748 sq ft or 83.11 sq yards of site and Northern side of the 1st item, **2nd Item:-** East to west – 15 ft or 4.575 mts North to south – 7.6 ft or 2.287 mts Total 112.5 sq ft or 12.5 sq yards of site Total 2 items admeasuring 95.61 sq yards

That on behalf of My client I caution the General public, if any person/Institution, is having any objections, claims, interest for the above property, intended person may contact the undersigned with relevant documentary proof substantiating his/her/their objections, claims and disputes etc., within (5) days from the date this notice, failing which my client will proceed with transaction by accepting the above said property as security, as if there are no third party claims or objections in respect of above said property and thereafter no claims or objections will be entertained.

**KATARI MAHESH** M.A.,LL.M.,
ADVOCATE
D.NO.19-12-351, BAIRAGIPETTADA, TIRUPATI,
CELL:9652405240